హెచ్‌ఐవీ రోగులకు క్యాన్సర్ ముప్పు

- తాడిపత్రి ప్రాంతంలో సర్వే ప్రారంభం
- ప్రభుత్వాస్పత్రిలో కౌన్సెలింగ్ సెంటర్



తాడిపత్రి రూరల్ : హెచ్‌ఐవీ రోగుల్లో క్యాన్సర్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఆధికారులు సెంటినాల్ సర్వే చేపట్టారు. హెచ్‌ఐవీ సోకి మందులు వాడుతున్న రోగుల్లో బీపీ, షుగర్, హైపటైటీస్–బీ, సీ, సిఫిలిస్, మహిళల్లో కార్షియల్ తదితర పరీక్షలు కోసం బ్లడ్ శాంపిల్స్ తీసుకుంటున్నారు. మిగిలిన వారికంటే 10 శాతం ఎక్కువగా హెచ్‌ఐవీ రోగుల్లో క్యాన్సర్ వ్యాపించే అవకాశాలు ఉన్నాయన్న దానిపై సర్వే చేస్తున్నారు. అంతేకాకుండా గర్భిణులకు ఎక్కువ పరీక్షలు నిర్వహిస్తున్నారు. హెచ్‌ఐవీ శాతాన్ని గుర్తించేందుకు పరీక్షలు జరుపుతున్నారు. ఈ ఏడాది మార్చి చివరి వరకు సర్వే చేయనున్నారు. సర్వే నివేదికను అనుసరించి నివారణ చర్యలు తీసుకోనున్నారు.

తగ్గని హెచ్‌ఐవీ రోగుల సంఖ్య

హెచ్‌ఐవీ రోగుల సంఖ్యను తగ్గించడానికి పలు రకాల ప్రయత్నాలు జరుగుతున్నా వాటి సంఖ్య తగ్గడం లేదు. తాడిపత్రి ప్రాంతంలో సిమెంట్, స్టీల్ వంటి భారీ పరిశ్రమలు, వందలాది గ్రానైట్, బండల పాలిష్ యునిట్లు ఎక్కువగా ఉన్నాయి. వీటిలో పనిచేసే కార్మికుల్లో ఎక్కువ శాతం మంది ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చిన వారే. వారిలో జార్ఖండ్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన వారు ఉన్నారు. పారిశ్రామికంగా తాడిపత్రి విస్తరించడంతో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ముడి సరుకుల ఎగుమతి, దిగుమతుల పేరుతో వందలాది లారీల రాకపోకలు కొనసాగిస్తుంటాయి. వీటన్నింటి కారణంగా హెచ్‌ఐవీ ఎక్కువ వ్యాపించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటున్నాయని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.తాడిపత్రి ప్రాంతంలో 2010 నుంచి 2024 డిసెంబర్ వరకూ 1,068 రోగులు ఉన్నారని వైద్యులు నిర్ధారించారు. హెచ్‌ఐవీ సోకిందన్న అనుమానం ఉన్న వారిలో పలువురు తాడిపత్రి కౌన్సిలింగ్ కేంద్రంలో పరీక్షలు చేయించుకోకుండా అనంతపురం, నార్పల ఆర్డీటీ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో పరీక్షలు చేయించుకుంటున్నారు. పరీక్షల్లో హెచ్‌ఐవీ నిర్ధారణ అయితే అక్కడి నుంచి మందులు తీసుకుంటున్నారు. వీరిని కలిపితే హెచ్‌ఐవీ రోగుల శాతం మరింత పెరగనుంది. గతంలో తాడిపత్రి ప్రాంతంలోని పలు చోట్ల బాక్స్‌లను ఏర్పాటు చేసి ఉచితంగా కండోమ్స్‌లను ఉంచేవారు. ప్రస్తుతం వాటిని పెట్టడం లేదు. హెచ్‌ఐవీ రోగుల సంఖ్య పెరగడానికి ఇది ఒక కారణం అవుతోంది. ప్రస్తుతం తాడిపత్రి ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నుంచి ప్రతి నెలా దాదాపు 450 మంది రోగులు మందులను తీసుకుంటున్నారు. వీరికి నెలకు రూ.4వేల పింఛన్ అందుతోంది.

ప్రభుత్వాస్పత్రిలో కౌన్సెలింగ్ సెంటర్

స్థానిక ప్రభుత్వాస్పత్రిలో హెచ్‌ఐవీకి సంబంధించి కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. తాడిపత్రి ప్రాంతంలోని తాడిపత్రి పట్టణ, మండలం, పెద్దపప్పూరు, యాడికి, పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన హెచ్‌ఐవీ రోగుల కోసం కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో కౌన్సిలర్‌తోపాటు ల్యాబ్ టెక్నీషియల్‌లను నియమించారు. హెచ్‌ఐవీ రోగుల సర్వే, హెచ్‌ఐవీ పట్ల ప్రజల్లో అవగాహన తదితర వాటి కోసం ఏపీఎస్ఏసీఎస్ సంస్థ ప్రతినిధులు పనిచేస్తున్నారు. కాగా తాడిపత్రి ప్రాంతంలోని దాదాపు 450 మంది హెచ్‌ఐవీ రోగులకు ఆర్డీటీ నుంచి నెలసరి సరుకులు పంపిణీ జరిగేవి. పలు కారణాల పేరుతో మూడు నెలలుగా సరుకులు పంపిణీ నిలిచిపోయింది. సరుకుల పంపిణీ నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.



తాడిపత్రి ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన హెచ్‌ఐవీ పరీక్షల కేంద్రం

హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలి



హెచ్‌ఐవీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. హెచ్‌ఐవీ సోకిన వారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకుని మందులను వాడాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం అవుతుంది. హెచ్‌ఐవీ సోకుండా ముందు జగ్రత్త చర్యలు తీసుకోవాలి.

– డెవిడ్, మెడికల్ ఆఫీసర్, తాడిపత్రి

తాడిపత్రి ప్రాంతంలో హెచ్‌ఐవీ వ్యాప్తి ఇలా

సంవత్సరం	రోగుల సంఖ్య
2010	73
2011	144
2012	75
2013	72
2014	71
2015	75
2016	52
2017	53
2018	74
2019	77
2020	52
2021	70
2022	72
2023	61
2024	47

క్లుప్తంగా

కుష్టు నిర్మూలనకు కృషి చేయండి


మాట్లాడుతున్న డాక్టర్ అనుపమ జేమ్స్

బుక్కరాయసముద్రం: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. మంగళవారం మండలంలోని కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రంలో డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని అధ్యక్షతన కుష్టువ్యాధి నిర్మూలనపై వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుపమ జేమ్స్ మాట్లాడుతూ కుష్టు వ్యాది నిర్మూలనపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. శరీరంపై రంగు గల మచ్చలు, స్పర్శలేని మచ్చలు, పాలి పోయిన మచ్చలు, దురద లేని మచ్చలు ఉన్నట్లు అయితే, వారి వివరాలు గుర్తించాలన్నారు. కుష్టువ్యాధి ఆరంభంలోనే గుర్తిస్తే నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మోహన్‌బాబు, సామాజిక ఆరోగ్య అధికారి పర్వీన్, ఉమామహేశ్వరి, శ్రీదేవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించాలి

యల్లనూరు: పల్లెల్లో ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని పుట్లూరు సీఐ సత్యబాబు సూచించారు. మంగళవారం ఆయన యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పల్లెల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుంటే పోలీసులకు తెలియజేసి సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. చిన్నవాటికి పెద్ద పెద్ద నిర్ణయాలు తీసుకోవద్దన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచండి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో అధ్వానంగా మారిన పారిశుధ్యం మెరుగుపరిచి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం కమిషనర్‌ను ఆ పార్టీజన్ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ తదితరులు కలసి వినతిపత్రాన్ని అందజేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటా చెత్తసేకరణ క్రమంగా జరిగేదని, ప్రస్తుతం చెత్తసేకరణ ఆటోలు రాకపోవడంతో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయన్నారు. పార్టీ నాయకులు రఘునాథరెడ్డి, నారాయణ, విశ్వనాథ్, గోపి, బాషా తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మృతదేహానికి నివాళులర్పిస్తున్న వీరాంజనేయులు

పామిడి: పట్టణంలోని మార్కెట్ వద్ద వైఎస్సార్ సీపీ దళిత నాయకుడు, మాజీ డీలర్ దాసరి కృష్ణ తల్లి జయమ్మ(80) మృతిపై మంగళవారం ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మృతదేహం వద్ద ఆయన శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లప్ప, ధను, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

యాడికి: అక్రమంగా మద్యం అమ్ముతున్న బోయరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్ రెడ్డి అరెస్టు చేశామని సీఐ ఈరన్న, ఎస్ఐ వెంకటరమణ మంగళవారం తెలిపారు. అతడి నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న గేట్స్ విద్యార్థులు

గుత్తి: గుత్తిలో మంగళవారం క్యాన్సర్‌పై గేట్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు అవగాహన ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. గేట్స్ ఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రభుత్వాస్పత్రి వైద్యులు పరమేశ్వర్, అమర్‌నాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి గేట్స్ ఎండీ తో పాటు వైద్యులు మాట్లాడారు. క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి అయినప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే నివారించవచ్చన్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలి, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, వ్యాయామం, వ్యసనాలకు దూరంగా ఉండటం ద్వారా క్యాన్సర్‌ను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ , పీడీ జోయెల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు


కసాపురంలో సూర్యయంత్ర ఆరాధన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


కసాపురంలో ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


పామిడిలో అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి గ్రామోత్సవం

గుంతకల్లు రూరల్: కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరుడువాహనంపై కొలువుదీరిన సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి విగ్రహాలను ఆలయ ముఖమండప ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో రథసప్తమి పూజలు చేశారు. సూర్యనారాయణస్వామి యంత్రాన్ని ఏర్పాటు చేసి ఆరాధనలు నిర్వహించారు. అక్కడే చెక్కెర పొంగలిని సిద్ధం చేసి స్వామివారికి నివేధించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు, ఇతర సిబ్బంది అందరూ కలిసి సామూహిక సూర్యనమస్కారాలు చేశారు. అనంతరం గురుడ వాహనంపై కొలువదీరిన స్వామివార్లను ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కే వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని తగ్గుదేవాలయం, నగరేశ్వర ఆలయాల్లో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తగ్గుదేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ దేవతామూర్తులకు అభిషేక అర్చనలు చేశారు. విష్ణు సహస్రనామ పారాయణం గావించారు. అలాగే స్థానిక నగరేశ్వర ఆలయంలో సనాతన బ్రహ్మ సంఘం అధ్యక్షుడు నాగరాజారావు ఆధ్వర్యంలో సూర్యభగవానుడి విగ్రహానికి అభిషేకార్చలతో కూడిన విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో పంచయతీ ఈఓ గోపాల్, వైద్యులు శివకార్తీక్‌రెడ్డి, కమలాధర్, రాఘవేంద్ర, ఆలయ ట్రస్ట్ చైర్మన్ సాయిప్రకాష్, టీడీపీ నాయకులు గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరి, మాజీ ఎంపీటీసీ బొల్లు శ్రీనివాసులు రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేయాలి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

పెద్దవడుగూరు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సర్వే పకడ్బందీగా నిర్వహించాలని గుంతకల్లు డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ నరసింహారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వే నిర్వహణపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకరావాలన్నారు. సర్వే సమయంలో ఇంటి కుటుంబ సభ్యులతో సమాచారం సేకరించి నమోదు చేయాలన్నారు. సర్వే వంద శాతం పూర్తి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో సేకరించిన చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్‌కు ఆర్థికసాయం


పాస్టర్ మోషేకు నగదు అందజేస్తున్న వై.పి.బాబు

శింగనమల: మండలంలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన పాస్టర్ మోషే అనంతపురంలో రోడ్డు ప్రమాదంలో సోమవారం గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు వై.పి.బాబు మంగళవారం గురుగుంట్లకు వచ్చి పాస్టర్‌ను పరామర్శించి, స్వస్థత నిమిత్తం ప్రార్థనలు చేశారు. అనంతరం చికిత్స కోసం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆదేవిధంగా పాస్టర్లు బిషప్ వాసు అనిల్ కాంత్, అబ్రహమయ్య, జాకోబ్, సాల్మన్‌రాజు, పాల్, తిమోతి పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి గ్రామ శివారులో కర్నూలు జిల్లా సరిహద్దు వద్ద మంగళవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని మల్లేష్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామానికి చెందిన మల్లేష్ పని నిమిత్తం ద్విచక్రవాహనంలో గుత్తికి వచ్చాడు. పనులు ముగించుకొని తిరిగి గ్రామానికి వెళ్తుండగా పెండేకల్లు రైల్వే బ్రిడ్జి సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం మల్లేష్ బైక్ ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన మల్లేష్‌ను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం, హత్య ఘటనపై నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ, సీపీఐ, సీపీఎం నాయకులు

గుత్తి: గుంటూరు జిల్లా పెదనందిపాడులో ఓ వృద్ధురాలిని అత్యాచారంతో పాటు హత్య చేయడాన్ని నిరసిస్తూ గుత్తిలో మంగళవారం బీఎస్పీ, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. గాంధీ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం, నియోకవర్గం అధ్యక్షుడు విజయ్ మాట్లాడారు. అత్యాచారం, హత్య ఘటనలో నిందితులను అరెస్టు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు వెంకట కొండయ్య, ఓబులేసు, రామాంజనేయులు సీపీఐ నాయకులు మముదా, నజీర్, సీపీఎం నాయకులు రామకృష్ణ, రేణుక, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.40 లక్షలు చెల్లించాలి


మాట్లాడుతున్న రైతులు

గుంతకల్లు: నూతన రైల్వే లైన్ మార్గం కోసం భూములు కోల్పోయే తమకు ఎకరాకు రూ.40 లక్షలు చెల్లించాలని రైతులు ఆర్డీఓ వద్ద మొరపెట్టుకున్నారు. పట్టణ శివారులోని వెస్ట్ గుంతకల్లు రైల్వేస్టేషన్ నుంచి నంచర్ల రైల్వేస్టేషన్‌ల మధ్య నూతన రైలు మార్గం (బైపాస్‌లైన్) ఏర్పాటుకు భూములు కోల్పోతున్న రైతులతో మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీనివాస్ రైతులతో చర్చించారు. రైతులు పూల రమణ, యు.ప్రభాకర్, వరదరాజులు, సత్యనారాయణ స్వామి తదితరులు మాట్లాడుతూ పట్టణ సమీపంలోని కసాపురం, చిప్పగిరి, దౌల్తాపురం గ్రామ సమీపంలో సారవంతమైన భూములున్నాయన్నారు. గతంలోనే డబ్లింగ్ రైలు మార్గానికి, హంద్రీనీవా కెనాల్ నిర్మాణానికి భూముల కోల్పోయన్నట్లు గుర్తు చేశారు. భూములు మధ్యలో రైలు మార్గం ఏర్పాటు చేయడంతో పొలాల్లోకి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లల్లో వెళ్లాలంటే సరైన మార్గం లేక ఇబ్బందుల పడుతున్నామన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని గిట్టుబాటుధరగా కింద ఎకరాకు రూ.40 లక్షలు చెల్లించడంతో పాటు తమ అనుకులంగా ఉన్న ప్రాంతాల్లో దారులు (మోరీలు) ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా రైల్వేకు భూములు ఇచ్చిన తరువాత మిగిలిన భూములను 08 కింద (ప్రభుత్వ భూములు) చూపిస్తాయన్నారు. అనంతరం ఆర్‌డీఓ మాట్లాడుతూ మీ విజ్ఞప్తులను జిల్లా అధికారులకు తీసుకెళ్లి న్యాయం చేయడానికి కృషి చేస్తానన్నారు.

ఆర్ఆర్‌బీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ కార్యదర్శి సురేంద్ర

గుంతకల్లుటౌన్: పోలీస్ కానిస్టేబుల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించిన వారితో పాటు ఆర్ఆర్‌బీ గ్రూప్–డీ అభ్యర్థులకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి స్థానిక శ్రీసాయి డిగ్రీ ఉమెన్స్ కాలేజీలో సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకూ అనువజ్ఞులైన అధ్యాపకుల చేత ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. గుంతకల్లు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌లో ప్రయాణికుల కష్టాలు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌లోని కొందరు సిబ్బంది తీరుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వారి అనుభవరాహిత్యమో, నిర్లక్ష్య వైఖరినో తెలియదు కానీ రిజర్వేషన్ కోసం వచ్చే వారికి కష్టాలు తప్పడం లేదు. ఇందుకు మంగళవారం చోసుచేసుకున్న సంఘటన ఉదాహరణగా చెప్పవచ్చు. తాడిపత్రి పట్టణానికి చెందిన శ్రీధర్ కుంభమేళాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈ నెల 6న ప్రయాగ్‌రాజ్ నుంచి తాడిపత్రికి రిజర్వేషన్ కోసం రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. రిజర్వేషన్ కౌంటర్‌లో ఉన్న ఉద్యోగి సైట్ ఓపన్ కాలేదని చెప్పడంతో శ్రీధర్ ఆశ్చర్య పోయాడు. మరి కొన్ని గంటల్లో గుంతకల్లు నుంచి ప్రయాగ్‌రాజ్‌కు మైసూర్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లడానికి సిద్ధమవుతున్న సమయంలో తిరుగు ప్రయాణానికి రిజర్వేషన్ సైట్ ఓపన్ కాలేదని చెప్పడం పట్ల ఆందోళనకు గురయ్యాడు. రెండు రోజుల ముందు రిజర్వేషన్ కోసం సైట్ ఎందుకు ఓపన్ కాదని ప్రశ్నించాడు. అదేమి తనకు తెలియదంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఈ విషయాన్ని స్టేషన్ ఆవరణలో ఉన్న కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అనుకుమార్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో ఆయన రిజర్వేషన్ కౌంటర్‌లోని వెళ్లి సైట్ ఓపన్ చేశారు. ఇప్పుడు ఎలా సైట్ ఓపన్ అయిందని ప్రయాణికుడు కౌంటర్‌లోని ఉద్యోగిని ప్రశ్నించగా సమాధానం చెప్పకపోగా అక్కడ ఉన్న మరో ఉద్యోగి రిజర్వేషన్ ఫారాన్ని దురుసుగా బయటకు విసిరివేయడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు.

8న కల్యాణోత్సవం

యల్లనూరు: మండలంలోని చింతకాయమంద గ్రామంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి కళ్యాణోత్సవం ఈనెల 8న నిర్వహించనున్నట్లు గ్రామపెద్ద కేశవ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ చెన్నకేశవ స్వామికి అర్చనలు, అభిషేకాలు, కల్యాణోత్సవం, అన్నదానం, పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. చిన్నారులచే చెక్కభజన ఉంటుందన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు.

శ్మశానానికి దారి ఏర్పాటు సంతోషదాయకం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో ముస్లిం శ్మశాన వాటికకు పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో మట్టి రోడ్డు నిర్మించడం సంతోషదాయకమని ముస్లింలు అన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరులో ముస్లింలు అభినందన సభ ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పంచాయతీ అధికారుల సహకారంతో పంచాయతీ 15వ ఆర్థిక సంఘం కేంద్ర నిధులతో ముస్లిం శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అలాగే శ్మాశన వాటిక దారి కోసం 17 మంది రైతులు తమ విలువైన భూములు ఉచితంగా అందజేశారన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ సహకరించి మట్టి రోడ్డు ఏర్పాటు చేశారన్నారు. సర్పంచు ప్రశాంతి, మాజీ ఎంపీటీసీ జగ్గాల రవి, ముస్లింలు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

యాడికి: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం సీపీఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫి, రజాక్, ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష డప్పులు– వెయ్యి గొంతుకలు కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు–వెయ్యి గొంతుకలు కార్యక్రమంలో పాల్గొనాలని నియోజక వర్గ ఎమ్మార్పీఎస్ నాయకుడు పుల్లయ్య కోరారు. నరసింహ, పుల్లయ్య, కుళ్లాయప్ప, రామాంజనేయులు, గాంధీ, వెంకటరమణయ్య, టైలర్ పుల్లయ్య, బాలాజీ, మారెన్న, రాజు, సూరి, బాలు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి విహారం


బేతాపల్లిలో విహరిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి, ఊటకల్లు, యంగన్నపల్లి, వన్నేదొడ్డి గ్రామాల్లో మంగళవారం లక్ష్మీనరశింహ స్వామి విహరించారు. గుత్తి కోటలోని కొండపై వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం ఈ నెల 22న జరగనుంది. ఈ నేపథ్యంలో స్వామి ఉత్సవ విగ్రహన్ని పల్లకిపై ఉంచి భక్తులు స్వయంగా గ్రామాల్లో ఊరేగించి కల్యాణ ఆహ్వాన పత్రికలను ఆయా గ్రామాల్లో గ్రామస్తులకు అందజేశారు. ఆనవాయితీగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని గ్రామస్తులు పాటించి స్వామి ఉత్సవ విగ్రహన్ని గ్రామంలోకి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామాల్లో భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 22 వరకూ గుత్తి మండలంలోని అన్ని గ్రామాల్లో లక్ష్మీనరసింహస్వామి విహరిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుత్ రైలుకు వందేళ్లు.. సిబ్బంది సంబరాలు


గుత్తి ఆర్ఎస్‌లో ర్యాలీ చేస్తున్న రైల్వే కార్మికులు

గుత్తి: విద్యుత్ రైలు ప్రారంభించి మంగళవారం నాటికి వందేళ్లు పూర్తి కావడంతో గుత్తి ఆర్ఎస్‌లో రైల్వే అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సంబరాలు నిర్వహించారు. డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ ఆధ్వర్యంలో కార్మికులు డీజిల్‌షెడ్ వద్ద నుంచి రైల్వే బుకింగ్ ఆఫీస్, అంబేద్కర్ పార్క్ మీదుగా రైల్వే ఆస్పత్రి వరకూ భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ డీఎంఈ ప్రమోద్ మాట్లాడారు. 1925 ఫిబ్రవరి 3న ఇండియాలో మొట్ట మొదటి విద్యుత్ రైలు ప్రారంభమైందన్నారు. రైల్వే అధికారులు, ఉద్యోగులు, కార్మికులు కృషి, పట్టుదల , శ్రమ ఫలితంగా విద్యుత్ రైలు వందేళ్ల పూర్తి చేసుకుందన్నారు. భారతీయ రైల్వేలు రోజూ కోట్లాది మంది జనాలను గమ్య స్థానాలకు చేర్చడంతో పాటు విలువైన వస్తువులను గమ్య స్థానాలకు చేరుస్తున్నాయన్నారు కార్యక్రమంలో ఏడీఎంఈ లు అశోక్ గౌడ్, సుంకన్న, సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు మనోజ్, ప్రభుదాస్, విజయానంద్, వందలాది మంది డీజిల్‌షెడ్ కార్మికులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు

యల్లనూరు: ఆర్టీసీ బస్సులు సమయ పాలన పాటించడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభ సమయానికి బస్సులు ఉండకపోవడంతో ప్రైవేట్ వాహనాలనను ఆశ్రయిస్తున్నారు. ఉదయం విధులకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుంటారు. సాయంత్రం ఐదు గంటలకు బస్సు మిస్ అయితే మళ్లీ ఆరు గంటల వరకు ఉండదటున్నారు. ఇటీవల బస్సులు సక్రమంగా నడపడం లేదని తాడిపత్రి డిపో మేనేజర్ శంకర్‌కు యల్లనూరు ప్రభుత్వ ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సక్రమంగా బస్సు సర్వీసులను నడపాలని ఉద్యోగులు కోరుతున్నారు.

కొనసాగుతున్న పింఛన్ల వెరిఫికేషన్


ఏకులనాగేపల్లిలో పింఛన్లు పరిశీలిస్తున్న వైద్యులు

శింగనమల: మండలంలో ఎన్టీఆర్ భరోసా కింద రూ.15 వేలు పింఛన్లు పొందుతున్న పింఛన్‌దారులను కర్నూలు జిల్లాకు చెందిన వైద్యులు పరిశీలన ప్రారంభించారు. మండలంలోని ఏకులనాగేపల్లి, లోలూరు, చిన్నజలాలపురం గ్రామాల్లో మూడు టీంలు పరిశీలిస్తున్నాయి. పింఛన్ పొందుతున్న లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని పరిశీలించారు. తరిమెల పీహెచ్‌సీ వైద్యులు శంకర్ నాయక్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.